

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# కళాప్రేమ

**రాత్రి పదిగంటలకు** వీధితలుపు మూసి పడుకోవడానికి లోపలికెళ్తూంటే తలుపు తట్టిన చప్పుడైంది. ఈ టైములో యెవరా అనుకుంటూ మళ్లీ వెనక్కొచ్చి తలుపు తెరిచి చూసాను, మురహరి నిల్చోనున్నాడు. ఒకక్షణం ఆశ్చర్యపోయి 'లోపలికి రమ్మ'న్నాను.

"నీతో మాట్లాడేదుంది సూర్యం, యింట్లోకాదు, నదివొడ్డుకెళ్దాం రా" అన్నాడు.

"ఒక్క నిముషం" అని లోపలికెళ్లి వంటింట్లోవున్న మా ఆవిడ కామేశ్వరికి చెప్పాను.

"వచ్చాడూ? యివాళో, రేపో వస్తాడనే అనుకుంటున్నాను మీ స్నేహితుడు" అంది నవ్వుతూ. మురహరి యింట్లో వంటచేసే ఆమె మా ఆవిడ దగ్గరికొస్తూంటుంది. 'విషయం తనకేదో తెలిసినట్టే ఉంది. ఐనా ఒక పట్టాన చెప్పదు పెంకెఘటం' అనుకుని "సరే తలుపేసుకో" అని బయటికొచ్చాను. మురహరి వీధిలో పచార్లు చేస్తున్నాడు.

చెట్లనీడల చీకట్లలో ఇద్దరం నదివొడ్డుకేసి నడిచాం.

మురహరి మావీధిలో మా ఎదురువైపు అంటే బురుజు లైన్లో నదినుంచి ఆరోయిల్లు, నదిఒడ్డునున్న రాయుడిగారిమేడ పక్కనుంచి మూడోది.

మురహరి నాకు స్కూల్లో ఒక సంవత్సరం జూనియర్. వాళ్లనాన్న అచ్చయ్య పెద్దవకీలు, అప్పట్లో బాగా సంపాయించాడు. వాళ్లకి పెద్ద ఇల్లు, పొలాలు, బ్యాంకు బ్యాలన్సు ఉన్నాయి. ఇద్దరాడపిల్లల తరువాత ఒక్కడే కొడుకు. ఇంట్లో అవ్వలు ముద్దుచేసి చదువుమీద శ్రద్ధపెట్టక బియ్యేతో ఆపేసాడు. మురహరికి చిన్నప్పట్నుంచి పెయింటింగంటే పిచ్చి. ఉద్యోగ ప్రయత్నాలేమీ చెయ్యకుండా బొమ్మలేసుకుంటూ ఇంటివద్దే ఉండిపోయాడు.

తనెప్పటికైనా 'దామెర్ల రామారావు', 'రవివర్మ'లంత పెద్ద పెయింటర్నౌతానని అతనికి బలమైన నమ్మకముండేది. ఉద్యోగాల వేటలోవున్న మమ్మల్ని చూసి 'తన విలువైన జీవితాన్ని జీతంరాళ్లకోసం తాకట్టు పెట్టనని' అనేవాడు.

పెయింటింగులు బాగానే వేసినా అతనికంత గుర్తింపు రాలేదు. వాణిజ్యప్రకటనల్లో, సినిమాల్లో ప్రయత్నించమని కొందరు మావీధిపెద్దలు సలహా ఇచ్చినా అతను 'కళను అమ్ముకుంటానా' అని వాళ్లమాటను లెక్కజెయ్యలేదు. అంతేగాక గుళ్లో గోడలకు పెయింటింగులెయ్యమని, వాళ్లతాతల పాత ఫోటొలిచ్చి ఉచితంగా ఆయిల్ పోర్ట్రెట్లు గీయమని, బలవంతపెట్టినా ససేమిరా అన్నాడు.

దాంతో సహజంగానే మా వీధిపెద్దలకు కోపమొచ్చి అతన్ని వెటకారం చేసేవారు. క్రమంగా పట్టించుకోవడం మానేసారు, 'కళ విలువ తెలియనివాళ్లతో తనకే'మని అతనూ బయటికిరావడం తగ్గించి తన పెయింటింగుకు

అంకితమయ్యాడు. చిన్నప్పటినుంచి నాతో అతను సన్నిహితంగాఉన్నా మా వీధిపెద్దల దయ తప్పినవాడని పెద్దయ్యాక నేను కొంచెం దూరంగానే ఉన్నాను.

మన సమాజంలో కళాకారులకు పెళ్లిసంబంధాలెక్కడొస్తాయి? మంచి సంబంధాలకోసం వాళ్లనాన్న చేసిన అనేక ప్రయత్నాలు ఫలించక చివరికి చెన్నైలోని ఆయన స్నేహితుడు చిత్రకారుడొకాయన బీదస్థితిలోవుంటే వాళ్లమ్మాయితో మురహరికి పెళ్లిచేసాడు. చిత్రకారుడి కూతురు కాబట్టి తన కొడుకును అర్థం చేసుకుంటుందని ఆయన అనుకున్నాడు. మురహరి భార్య మొదట్లో బాగానేవుండినా తరువాతి రోజుల్లో కళాకారులపట్ల తనకుండే ద్వేషాన్ని బయటపెట్టింది. తండ్రి చిత్రకారుడవడంవల్లే తమ సంసారం అలా తగలడిందని ఆమె కోపమట. పిల్లలుపుట్టిన తరువాత రోజూ భార్యాభర్తలమధ్య గొడవలే.

మురహరి తల్లిదండ్రులు కాలంచేసిన తరువాత ఇక మా వూర్లో ఉండలేనని ఆమె ఇద్దరు పిల్లలతోసహా చెన్నైకి వెళ్లిపోయింది. విధిలేక మురహరి బ్యాంకు బ్యాలన్సులన్నీ చెన్నైకి తరలించాడు. నాలుగేళ్లగా తనే చెన్నైవెళ్లి చూసొస్తున్నాడు. పొలాలమీద, ఎప్పుడైనా చిత్రాలమ్ముడుబోవడంవల్ల వచ్చే ఆదాయంతో అతను ఇక్కడేవుండి తన చిత్రకళను కొనసాగిస్తున్నాడు.

ఎవరూలేని దూరపు చుట్టం ఒకావిడ వంటావిడగా ఉండిపోయింది. ఆమె లేనప్పుడు మావీధి పరోపకారి పాండురంగ, అతని భార్య సుశీల అతనికి భోజనం పంపించి ఆదుకుంటూంటారు.

నదివొడ్డున రావిచెట్టుకింద చెప్టామీద కూర్చున్నాం. గుడిలో పనిచేసే లక్షుమ్మ మూసేసిన గుడి తలుపుపక్కన అరుగుమీద బొంతపరుచుకుని పడుకుని తత్వాలు పాడుకుంటోంది. బురుజువరకూ వీధంతా దాదాపు నిర్మానుష్యంగావుంది. నదికవతలి మూసేసిన ఫ్యాక్టరి గుడ్డిదీపాల వెల్తురు తప్ప అటువైపంతా చీకటిగావుంది. నదిపైన చల్లనిగాలి నక్షత్రాలవైపు కదులుతోంది. రెండుమూడు రాత్రిపక్షులు అటూఇటూ తిరుగుతున్నాయి.

"నువ్వు కొండయ్యతో వొకసారి మాట్లాడాలి, అతను నన్ను చాలా యిబ్బంది పెడుతున్నాడు" అన్నాడు మురహరి. నాకిది వింతగా కనబడింది.

"కొండయ్యా నువ్వూ క్లాస్మేట్లు, పైగా మంచి స్నేహితులుగదా. యేవిధంగా యిబ్బంది పెడుతున్నాడు? అతనెక్కడో కర్ణాటకలో కాంట్రాక్టులు చేస్తున్నాడుగదా?" అన్నా.

"నేను అవసరానికి కొండయ్య దగ్గర అప్పుచేసాను. చెన్నైలో ఖర్చులు, పిల్లలకి ఫీజులు పెరిగాయి. యిక్కడ పొలాలమీద యిదివరకులాగ ఆదాయం రావడంలేదు" అన్నాడు

"మొన్నటి దాకా నువ్వే కొండయ్యకు సాయం చేసావు గదా. అతని దగ్గర నువ్వు అప్పుచెయ్యడమేంటి? బాకీ తీర్చమని వొత్తిడి చేస్తున్నాడా?"

"వడ్డీతో చాలామొత్తం అయిందిలే. డబ్బు దగ్గర స్నేహాన్ని వదిలేయడం కొంతమందికి సహజమే గదా. నువ్వు మాట్లాడి కొన్నాళ్లాగమనాలి. యింక వడ్డీ కట్టద్దని చెప్పాలి"

"కొండయ్య నా మాట వింటాడా? ఐనా యిక్కడ లేడుగా?"

"రేపువారంలో వస్తున్నాడు. నువ్వతనికి చదువుకునేప్పుడు చాలా సహాయం చేసావు, యింగ్లీషు, లెక్కల్లో అతను టెంత్ ప్యాసయ్యాడంటే దానికి నువ్వే కారణం. అతనికి నువ్వంటే గురి. నీదగ్గరికి తీసుకొస్తాను. నాకీ సహాయం చేసిపెట్టు" అన్నాడు మురహరి.

"సరే. గట్టిగా చెప్తాలే. నువ్వంతగా అడగాలా" అని ఆవలిస్తూ లేచాను. కళాకారులంటే నాకున్న గౌరవంవల్ల, వాళ్ల కష్టాలగురించి చిన్నప్పట్నుంచి చదవడంవల్ల అతనికి కొంత ధైర్యంచెప్పి ఇంటివరకూ దిగబెట్టి మా ఇంటివైపు నడిచాను.

కొండయ్యది వ్యవసాయకుటుంబం. వాళ్లవూరు నదికవతల రెండుమైళ్లు. మురహరి ఊరికి పక్కనే. వాళ్లకుటుంబాలకు మంచి అనుబంధం ఉండేది. కొండయ్య బాగా చదువుకోవాలని వాళ్లనాన్న చెయ్యనిప్రయత్నం లేదు. కానీ అతనికి చదువు వంటబట్టలేదు. మురహరితో కల్సి చదువుకుంటేనైనా వస్తుందేమోనని వాళ్లింట్లో కొన్నాళ్లుంచారు. చదువు సంగతేమోగాని విరుద్ధతత్వాలున్న వాళ్లిద్దరూ స్నేహితులయ్యారు. పదోతరగతి పరీక్షలకుముందు నన్ను కొండయ్యకు ఇంగ్లీషు, లెక్కలు చెప్పమని మాయింట్లో పెట్టారు. నేనేదో తంటాలుపడి అతన్ని పదోతరగతి గట్టెక్కించాను. ఇంటరెలాగో ప్యాసై టౌన్లో బియ్యే చేరి అల్లరిచిల్లరిగా తిరుగుతూ చదువుమానేసాడు.

ఆ తరువాత కొండయ్య కంట్రాక్టరు అవతారమెత్తి ఇంటిస్థలాల వ్యాపారంలో బాగానే సంపాయించాడు. వాళ్లనాన్న పేదరాలైన చుట్టాలమ్మాయి మంగతో అతనిపెళ్లి చేసాడు. పొలాల్లో పనిచేసిన మంగ చామనకంటే ఒక చాయ ఎక్కువతో, సౌష్టవమైన శరీరాకృతితో, కోలమొహంలో పెద్దకళ్లతో, అందంగా అమాయకంగా ఉండేది. మేమంతా ఆ పెళ్లికెళ్లి వాళ్లిద్దరూ సరిజోడుకాదని తీర్మానించాం. మురహరి ఒక్కడే ఎందుకో రాలేదు.

వాళ్లనాన్న పోయింతరువాత కొండయ్య చెడలవాట్లకులోనై సంపాదించిందంతా పోగొట్టుకొన్నాడు. మురహరి స్నేహధర్మంగా అతని కుటుంబాన్ని ఆదుకొని తనయింటి వెనకున్న పెంకుటింట్లో ఆశ్రయమిచ్చి, రెండు ఆవులనుకూడా కొనిచ్చాడు. కొన్నాళ్లయ్యాక కొండయ్య కంట్రాక్టులు చేయడానికి కర్ణాటక వెళ్లాడు. అతనక్కడ నిలదొక్కుకునేదాకా మంగ మురహరి ఇంట్లోనేవుండి, ఆతరువాత భర్తదగ్గరికి వెళ్లిపోయింది.

మర్నాడు కామేశ్వరితో ఇవన్నీ చెప్పి "పాపం కళాకారులకే అన్ని కష్టాలూ" అన్నాను.

“కొండయ్య మురహరికి అంతమొత్తం అప్పివ్వడం, చక్రవొడ్డీతోసహా కట్టమని వొత్తిడి చెయ్యడం, యిందులో యేదో తిరకాసుంది” అని “మురహరికి చేతిలో విద్య వుంటేనే సరిపోతుందా? నగరాల్లోజరిపే ప్రదర్శనలకెళ్తూండాలి, కొత్త పరిణామాలు తెల్సుకుంటూండాలి. యీనేమో యిల్లొదలడు. వొకసారి గట్టిగా చెప్పు" అంది కామేశ్వరి.

“చిత్రకళగురించి నాకేం తెలుసు? ఐనా తమరి వుత్తర్వులుకాబట్టి చెప్తాలే. యీమధ్య అతనువేసిన బొమ్మలేవీ నేను చూడలేదు" అన్నా నవ్వుతూ.

ఆమరుసటివారంలో ఓమూడ్రోజులు నేను వేరేవూరెళ్లి శనివారం తిరిగొచ్చాను.

నేనువస్తూండగా వాళ్లింటిముందు దేవగన్నేరు చెట్టుకింద నిలబడి హుస్సేన్ మియా చెక్కబండిలో సోడా తాగుతున్న మా ఎదురింటి చలపతి నన్నుపిలిచి “పాపం మురహరి నీకోసం చూస్తున్నాడు. మొన్న కొండయ్యొచ్చి, మనవీధి సంక్షేమసంఘంలో ఫిర్యాదుచేసి శుక్రవారంరాత్రి పంచాయతి పెట్టించాడు. కొండయ్య డాబుగా కార్లోవొచ్చి పంచాయతిలో మహాదూకుడు ప్రదర్శించాడులే. యింకేముంది? పెద్దమనుషులంతా మురహరిమీది పాతకోపంతో కొండయ్యనే సమర్థించారు. మురహరి తలొంచుకొని మౌనంగా ఉండిపోయాడు. ధనరాజు, మునిరెడ్డి, కాశీపతి, బసవలింగం, స్వామినాయుడు కొండయ్యపక్షమే వహించారు. ‘పెద్దలమాటలు పెడచెవినబెట్టి, కళాకారులమని గాలిలోమేడలు కట్టేవాళ్లు అప్పుచెయ్యరాదని, ఆదుకున్న పెద్దమనిషి బాకీతీర్చమని అడగడం న్యాయమేగదా’ అన్నారు. అప్పుతీర్చడానికి నెలరోజుల గడువు నిర్ణయించారు. కాశీనాథ్, రాజు యేదో రాజీ చెయ్యబోయారుగాని కొండయ్యొప్పుకోలేదు. మురహరివైపు మాట్లాడి నేనొంటరినైపోయా” అన్నాడు చలపతి.

చలపతితో మాట్లాడి ఇంటికిరాగానే "ఆదివారం మధ్యాహ్నం మురహరి, కొండయ్య నీతో మట్లాడ్డానికి మనింటికొస్తారట, మురహరొచ్చి చెప్పివెళ్లాడు" అంది కామేశ్వరి.

నేను మురహరి పరిస్థితికి బాధపడుతూ చలపతి ఇచ్చిన సమాచారం చెప్పాను.

"నాకూ తెలిసింది. కొండయ్య దూకుడు, బెదిరింపులు చూస్తే యిందులో వేరేయేదో వుందనిపిస్తోంది. మీరొకసారి మురహరితో విడిగా మాట్లాడండి, నిజం చెప్పమనండి" అంది

"మా సంఘపెద్దలు గడువు నిర్ణయిస్తూ తీర్మానంచేసాక నేను చేసేదేముంది" అన్నా

"మనవీధి పెద్దలెన్నడైనా న్యాయం సరిగ్గా చెప్పారా. మీకంటే కొండయ్యే వాళ్లను అర్థం చేసుకొని తన డాబును, వ్యాపారవిజయాలను ప్రదర్శించి తనవైపు తిప్పుకున్నాడు" అంది.

"మా సంఘపెద్దలు మురహరిమీద కోపంతో చేసుండచ్చుగాని కొండయ్యడాబుకు లోబడేంత తెలివితక్కువవాళ్లు కాదు. వాళ్లు ఆడవాళ్లను ఖాతరుచెయ్యరని నీకు కక్ష" అన్నా

"తెలివితక్కువ వాళ్లని యెవరన్నారు?" అని మూతితిప్పి వంటింట్లోకెళ్లిపోయింది.

అనుకున్నట్టుగానే ఆదివారం మధ్యాహ్నం మురహరి, కొండయ్య మా యింటికొచ్చారు. నేను వాళ్లను మేడపైకి తీసుకెళ్లాను. మామేడమీద పెంకులకప్పుతో ఒక రూము, వసారా ఉన్నాయి. వసారాలోని అరుగులమీద కూర్చున్నాము.

కొండయ్య ఖరీదైనవిగా కనిపించేవిధంగా బట్టలు వేసుకుని, వేళ్లకు పెద్ద ఉంగరాలు పెట్టుకున్నాడు గాని అవి నిజమైన మనిషిని దాస్తున్నట్టుగా ఉన్నాయి. నన్ను ఆదరంగా పలకరించి తన కంట్రాక్టులు, కష్టసుఖాలగురించి చాలాసేపు చెప్పాడు. మురహరి ఆకాశంలోకి చూస్తూ కుర్చున్నాడు. అతను డీలా పడిపోయినట్టు పగటివెల్తురులో బాగా తెలుస్తోంది.

కొండయ్య చెప్పటం అయ్యాక "నీ వ్యాపారం చక్కగావుంది గదా కొండయ్యా, మురహరి బాకీ తీర్చడానికి యింకో ఆర్నెల్లు ఆగచ్చుగదా. మీరు మంచిస్నేహితులు, యిదివరకు అతను నీకు సాయం చేసినవాడేగదా" అన్నాను.

"అన్నా నీకు తెలీనిదేముంది? రియలెస్టేట్లో మనడబ్బంతా ఎప్పుడూ యిరుక్కోనిపోయేవుంటుంది. యెప్పుటికప్పుడు కొత్తగాపెట్టకపోతే మునిగిపోతాం. యెంతో అవుసరమైతే తప్ప అడగతానా?" అన్నాడు కొండయ్య.

“నెలరోజుల్లో మురహరి యిచ్చేస్థితిలో లేడు, పంటలన్నా చేతికి రావాలగదా" అన్నా

"అది నాకూ తెలుసన్నా. పంటచేతికొచ్చినా తీర్చలేడు. అందుకే యిద్దరికీ యిబ్బందిలేని దారొకటి చెప్పినా. మురహరి వినడంలేదు" అన్నాడు కొండయ్య.

మురహరి హఠాత్తుగా కొండయ్యవైపు తిరిగి "కొండయ్యా, నువ్వొకప్పుడెంత స్నేహంగా వుండేవాడివి? అదంతా యిప్పుడేమైపోయింది? మళ్లీ ఆరోజుల్లోకి వెళ్లిపో, వెనక్కి వెళ్లిపో, వెళ్లిపో" అని అరిచాడు. అతని మొహమంతా యెర్రబడింది. కళ్లు విచ్చుకున్నాయి. వొళ్లంతా వణుకుతోంది. నాకు భయమేసింది. కానీ కొండయ్య తొణకలేదు. మురహరి ఉద్రేకంగా కొండయ్య తండ్రెంత పెద్దమనిషో, తనతో కొండయ్య ముందెంత ప్రేమగా ఉండేవాడో ఇంకొంచెంసేపు చెప్పి నిస్సత్తువగా గోడకానుకొని తలదించుకున్నాడు.

మా పెంకులకప్పు వసారాకింద వేడిగావుంది. వెనక మా పెరట్లోని చెట్లు గాలివీచక కదలడంలేదు. ముందువైపు చెట్లనీడల్లో సైకిళ్లు తొక్కుకుంటున్న మావీధి ఆడపిల్లల్లో ఎవరో పడినట్టున్నారు. సన్నగా ఏడుపు వినిపిస్తోంది.

"నువ్వు చెప్పిన యిబ్బందిలేని దారేది కొండయ్యా?" అన్నా కొంత సద్దుమణిగాక.

"మురహరి యెట్లా యిప్పుట్లో డబ్బులీలేదు. వడ్డీ పెరిగిపోతావుంది. అతనింట్లో వొక పాత ఆభరణముంది. యీరోజుల్లో దాన్నెవురూ వాడరు. అదిస్తే బాకీ చెల్లేసుకుంటా. దాని విలవ నా బాకీకి సరిపోతుంది. అదేచెప్పినా" అన్నాడు కొండయ్య.

"చెప్పినాగదా కొండయ్యా, అదెట్లాయిస్తాను? అది వంశపారంపర్యంగా వచ్చిన పచ్చల నెక్లేసు. అదొక్కటే మిగిలింది. మాఅమ్మ పోయేటప్పుడు నా భార్యమెడలో వేసింది. పండగలప్పుడు వాడతానేవున్నాం. యిక్కడైతే

భద్రంగావుంటుందని బీరువాలోపెట్టాం. నేనొప్పుకున్నా నాభార్య వొప్పుకోదు. దాన్నా నువ్వడగడం? యిదేనా స్నేహమంటే?" అని తిరిగి తన ముద్రలోకి వెళ్లిపోయాడు మురహరి.

"కొండయ్యా నీకావల్సింది డబ్బుగదా. అతనికి కొంత టైమిస్తే యిస్తానంటున్నాడుగదా. నామాట విని ఆర్నెల్లు ఆగు. నీకీడబ్బొక లెక్కా?" అన్నా.

"సరేన్నా, నువ్వు చెప్తావున్నావుగాబట్టి మూణ్ణెల్లాగతాను. యిప్పుణ్ణించి వడ్డీగూడా అడగను. అంతకంటే వొక్కరోజుగూడా నావల్లగాదు. అన్నా, మనుషులందర్లో మంచీచెడ్డా రెండూవుంటాయి. నువ్వు నాపక్కగుడా మట్లాడాలగదా" అన్నాడు కొండయ్య నిష్ఠూరంగా.

యిక నేనేం మాట్లాడలేక "సరే, అట్లాగే కానీ. మీయిద్దరు యివన్నీ మర్చిపోయి మళ్లా స్నేహితుల్లాగుండండి" అని లేచాను. ముగ్గరం కిందకొచ్చాము. కామేశ్వరి వాళ్లిద్దరి కుటుంబ క్షేమసమాచారాలడిగి ముగ్గరికీ ఉపాహారము, కాఫీ ఇచ్చింది. మురహరి దాదాపు మౌనంగానే ఉన్నాడు. ఆ తరువాత వాళ్లిద్దరు ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు.

మేడమీద జరిగిందంతా కామేశ్వరికి చెప్పాను.

"నేజెప్పలా, యేదో తిరకాసుందని. యిద్దరూ యింకాయేదో దాస్తున్నారు. నువ్వు తీరిగ్గా మురహరింటికెళ్లి మాట్లాడి నిజంరాబడితేగాని లాభంలేదు. అనవసరంగా మధ్యవర్తిత్వం నెత్తినేసుకున్నావు" అంది కామేశ్వరి.

"మురహరింట్లో ధర్మపీఠముందా యేం? యింకోచోటైతే నిజంచెప్పడా" అన్నా హాస్యంగా.

"అదేమరి. కథేదో జరిగిందక్కడే, నిజంగూడా అక్కడే బయటపడుతుంది" అంది.

"కథేమిటి? నీకప్పుడప్పుడూ అలౌకికదర్శనాలు ఔతూంటాయి మరి. లేదా మనవీధి 'వార్తల వనజమ్మ' యేదో అల్లి చెప్పివుంటుంది. సరే వెళ్తాలే" అన్నా.

మూడ్రోజులతరువాత ఓ సాయంత్రం మురహరి ఇంటికి వెళ్లాను. ఒకప్పుడు సందడిగావుండిన ఆ ఇంటి అరుగులు ఇప్పుడు నిశ్శబ్దంగావున్నాయి. మావీధివాళ్లకు చెందిన పొలాలుచూసే ముసలిరైతు కాబోలు అరుగుమీద ముడుచుకుపడుకున్నాడు. ఇంటిముందున్న మామిడిచెట్టు కింది ఎండిన అకులు నా కాళ్లకింద గలగల చప్పుడు చేసాయి. అటూయిటూ తిరుగుతూన్న మా వీధికుక్క ఒకటి నన్నుచూసి తోకముడుచుకుని మూలనున్న చీకట్లోకి వెళ్లింది.

వీధివైపు తలుపువేసివుంది. లోపలెక్కడో దీపం వెలుగుతూంది. పక్కనుంచి వెనకవైపుకు వెళ్లాను. మురహరి ఒక్కడే వెనకవరండాలో అరుగుమీద కూర్చొని ఎదురుగావున్నఖాళీ పెంకులవసారాను చూస్తున్నాడు. ఆ వసారాలోనే మంగ, కొండయ్య ఉండేవాళ్లు. ఆవెనక పనసచెట్టుకింద ఆవులుండేవి. నేనెప్పుడైనా పాలకోసం వచ్చేవాడిని. అక్కడింకా మంగ వున్నట్టేవుంది. ఆమె అక్కడ ఉండినప్పుడు ఆ పరిసరాలన్నీ కళకళలాడుతూండేవి. నన్నుచూసి నిర్లిప్తంగానవ్వి పక్కన చోటు చూపించాడు.

"యీమధ్య కొత్తబొమ్మలేమీ వెయ్యలేదా?" కాస్సేపు మాట్లాడాక అడిగాను.

"చూద్దువుగాని రా" అని లోపలికి తీసుకెళ్లాడు. వంటావిడ లేదు, బయటికెళ్లినట్టుంది.

హాల్లోంచి పక్కగదిలోకి తీసుకెళ్లి దీపం వెలిగించాడు. అది అతని స్టూడియో, గదంతా స్టాండులు, బోర్డులు, రంగుల ట్యూబులు, బ్రష్షులతో చిందరవందరగా ఉంది. కొన్నిబొమ్మలు గోడకు వెళ్లాడుతూన్నాయి. చాలా కాన్వాసులు చుట్టలుగా గదంతా పడివున్నాయి.

"మూణ్ణెల్లకింద వేసింది" అని ఒక స్టాండు మీదున్న చిత్రాన్ని చూపించాడు. అందులో ఒకతను చీకట్లు కమ్ముతున్న సముద్రంలోకి పడవలో వెళ్లిపోతూ, ఎర్రని సంధ్యవెలుగులో తీరంవైపు మృత్యుభయంతో చూస్తున్నాడు. నేను ఆందోళనగా అతనివైపు చూసాను.

"'యెడ్వర్డ్ ముంక్' అని నార్వే పెయింటర్ వేసిన 'అరుపు' స్టైల్లో వేసాను. కొన్నాళ్లనుంచి క్లాసికల్ బొమ్మలను వదిలేసి, మనుషుల లోపలిస్థితులను చూపించే యీ ఆధునిక చిత్రాలను వేస్తున్నాను. దీంతర్వాత యింకోటి వెయ్యలేదు" అన్నాడు.

"యెందుకట్లా? యింటా బైటా గొడవలతో, డబ్బవసరాల్తో విసిగిపోయావా?" అన్నా

మురహరి తదేకంగా కిటికీలోంచి బైటికిచూసి, చెక్కబీరువా దగ్గరికెళ్లి వొంగి అడుగుఅర బైటికిలాగి లోపల్నుంచి ఒక కాన్వాసులకట్ట తీసి నాచేతిలో పెట్టి "చూడు" అన్నాడు.

పక్కనున్న టేబులుమీద కట్టనువుంచి ఒకటివిప్పి చూసాను. అందమైన స్త్రీ బొమ్మ. ఒక ప్రత్యేక శృంగారభంగిమలోవుంది. కాని అసభ్యంగా లేదు. గొప్పగా చిత్రించాడు. మురహరి బొమ్మలంత బాగావేస్తాడని నేనెప్పుడూ అనుకోలేదు. కింద ఎడమవైపు 'అష్టవిధనాయికలు – వాసకసజ్జిక' అని రాసివుంది. కుడివైపున అతని సంతకం ఉంది.

"అన్నీ చూడు" అన్నాడు.

అవి మిగతానాయికల బొమ్మలు. మొత్తం ఎనిమిది లేవు, ఏడే ఉన్నాయి. వాటన్నిట్లోని స్త్రీ మొహం ఒక్కటే. అన్నీచూడగా నాకు ఎవరో బాగాతెలిసిన స్త్రీని చూసినట్టనిపించింది. వెంటనే స్ఫురించింది. అందులోవున్న మనిషి 'మంగ', కొండయ్య భార్య! నేను ఒకసారి మురహరివైపు చూసి కళ్లప్పగించి బొమ్మలనే చూస్తూండిపోయాను.

"అష్టవిధనాయికలు మొత్తం ఎనిమిదిమంది. యెనిమిదో బొమ్మ 'విరహోత్కంఠిత' కొండయ్యదగ్గరుంది. అదిపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు" అన్నాడు నీరసంగా.

"అంటే నువ్వతని దగ్గర అప్పు తీసుకోలేదా?" అన్నా ఆశ్చర్యంనుంచి తేరుకోకుండానే.

"నా ఆర్థికపరిస్థితి అంత బాగలేని మాట నిజమేగాని మరీ వాడిదగ్గర అప్పుచేసేంత దిగజారలేదు. వాడే నాదగ్గర చాలా డబ్బు తీసుకున్నాడు" అన్నాడు.

"యిందులో మంగ పాత్రకూడా వుందా?" అన్నా.

"ఆమెకేం తెలీదు, అమాయకురాలు. గౌరవంగా కూర్చోబెట్టి ఆమె మొహాన్ని మాత్రమే గీసుకున్నాను, మిగతాబొమ్మ నేను విడిగా వేసాను. ఐనా ఆమెను యిలా నిలబెట్టలేంగదా"

"కొండయ్యకు తెలీకుండా యీ బొమ్మలేసావా? అగ్రిమెంటు రాసుకోలేదా?"

"వాడికి చెప్పే వేసాను. నమ్మకంమీద అగ్రిమెంటు రాసుకోలేదు. ఆమెను మోడెల్ గా కూర్చోబెట్టినందుకు ఫీజుగా డబ్బుయిచ్చాను. యీ 'మోడెల్' సంప్రదాయం చిత్రకళలో వున్నదేకదా. అదనంగా చాలా యిచ్చాను. బొమ్మలు వేసేప్పుడు చూసికూడా అడ్డు చెప్పలేదు. పూర్తయ్యాక నేనులేనప్పుడు వొకటి కొట్టేసాడు. 'అది అందరికీ చూపించి, తన అనుమతిలేకుండా మంగను అలా నిలబెట్టి వేసాడని రచ్చ చేస్తానని, కేసుపెడతా'నని బెదిరించి, నేను వాడిదగ్గర పెద్దమొత్తం అప్పు తీసుకున్నట్టుగా డాక్యుమెంటు రాయించుకున్నాడు. డబ్బిచ్చాక బొమ్మ వాపసిస్తానన్నాడు"

"డబ్బుమీది వ్యామోహం యేపనైనా చెయ్యిస్తుంది. ఐనా నువ్వెందుకు భయపడ్డావు? రేపు నువ్వీ బొమ్మలను ప్రదర్శించినప్పుడైనా అందరికీ తెలుస్తుందిగదా?" అన్నా.

"నేనీ బొమ్మలు ప్రపంచంకోసం వెయ్యలేదు. నాకోసం వేసుకున్నా" అన్నాడు.

నేను నివ్వెరపోయాను. కాస్సేపయ్యాక "నువ్వు మంగను లోపల్లోపల ప్రేమించావా?" అన్నా. ఎందుకడిగానో నాకే తెలీదు. 'మంగకు దగ్గరగావున్న ఉన్నవాళ్లు ఆమెను ప్రేమించకుండా వుండలేరనుకుంటా' అని చలపతి రెండేళ్లక్రితం నాతో అనడం గుర్తొచ్చిందేమో.

"కళాకారుల ప్రేమ వ్యామోహంకాదు. యీలోకానికెప్పుడూ అర్థంకాదు. యిది వ్యాపారప్రపంచం" అన్నాడు మురహరి ఓడిపోయినవాడిలా.

నాకింక యేమ్మాట్లాడాలో తెలియక "మేమున్నాంగా. అన్నీ సర్దుకుంటాయిలే. మళ్లా బొమ్మలెయ్యడం మీద దృష్టిపెట్టు" అని అతని బుజంతట్టి బయటికి నడిచాను.

(మా బురుజు వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments